# పీహెచ్‌డీకి 1,194 దరఖాస్తులు

కూకట్‌పల్లి: జేఎన్‌టీయూలో పీహెచ్‌డీకి మొత్తం 1,194 దరఖాస్తులు వచ్చాయి. పార్ట్‌టైం, ఫుల్‌టైం, ఇండస్ట్రియల్ ఎగ్జిక్యూటివ్స్ విభాగాల్లో పీహెచ్‌డీ కోసం గత నెలలో నోటిఫికేషన్ ఇచ్చిన విషయం తెలిసిందే. పార్ట్‌టైం కోసం అత్యధికంగా 995 మంది దరఖాస్తు చేసుకోగా.. ఫుల్‌టైంకు 179.. ఇండస్ట్రియల్ ఎగ్జిక్యూటివ్స్ నుంచి 20 దరఖాస్తులు వచ్చాయి. వచ్చే నెలలో వీరికి ప్రవేశ పరీక్ష నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ప్రవేశాల విభాగం డైరెక్టర్ డాక్టర్ బి.బాలునాయక్ తెలిపారు.

# ఎప్‌సెట్ కౌన్సెలింగ్ ప్రారంభం



జేఎన్‌టీయూ ప్రవేశాల విభాగంలో విద్యార్థుల ధ్రువపత్రాలు పరిశీలిస్తున్న ఉద్యోగులు

కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: జేఎన్‌టీయూ ప్రవేశాల విభాగంలో మంగళవారం ఎప్‌సెట్ కౌన్సెలింగ్ ప్రారంభమైంది. మొదటిరోజు మొత్తం 900 మంది హాజరుకావాల్సి ఉండగా.. 778 మంది వచ్చారు. ప్రవేశాల విభాగం డైరెక్టర్ డాక్టర్ బి.బాలునాయక్ పర్యవేక్షణలో ఉద్యోగులు విద్యార్థుల ధ్రువపత్రాలు పరిశీలించి రసీదులు ఇచ్చారు. కౌన్సెలింగ్ 8వ తేదీ వరకు కొనసాగుతుందని అధికారులు తెలిపారు.

# జేఎన్‌టీయూ అప్పిలేట్ కమిటీ పరిశీలన షురూ

కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: నిజనిర్ధారణ తనిఖీల్లో గుర్తించిన కొరతలపై ఇంజినీరింగ్ కళాశాలల వివరణ నివేదికల పరిశీలన జేఎన్‌టీయూలో మంగళవారం అప్పిలేట్ కమిటీ ఆధ్వర్యంలో ప్రారంభమైంది. కమిటీ ఛైర్మన్‌గా వ్యవహరిస్తున్న వర్సిటీ రెక్టార్ డాక్టర్ కె.విజయ్‌కుమార్‌రెడ్డి నేతృత్వంలో పరిశీలన చేపట్టారు. గుర్తింపు పునరుద్ధరణలో భాగంగా మొత్తం 70 కళాశాలల్లో వివిధ రకాల కొరతలు ఉన్నట్లు గుర్తించగా.. వారి నుంచి వివరణ కోరడం.. వారు ఇప్పటికే వర్సిటీకి సమర్పించిన నేపథ్యంలో అప్పిలేట్ కమిటీ వాటి పరిశీలనకు రంగంలోకి దిగింది. మొదటి రోజు ఉదయం, సాయంత్రం రెండు దశల్లో 15 చొప్పున మొత్తం 30 కళాశాలలు ఇచ్చిన వివరణలను పరిశీలించారు.